భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: బోడుప్పల్ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి 10వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మల్లిఖార్జున స్వామి వారికి అభిషేకం, పుట్టు కమ్ముట, గంగతెప్పోత్సవం, 4వ తేదీన భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం, 5వ తేదీన రేణుకా ఎల్లమ్మవారి కల్యాణ మహోత్సవం, బోనాలు, గొలుసు తెంపుట, అగ్ని గుండాలు తొక్కుట, ఫలహార బండి ఊరేగింపు, 6వ తేదీన నిత్య పూజలు, అభిషేకాలు, అర్చనలు, 8న మహా శివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, లింగోద్భవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 10వ తేదీన కొండపోచమ్మ, అమ్మవారి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి



ఓటుపై అవగాహన, మాక్ పోలింగ్ విధానాన్ని వివరిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

ఉప్పల్: ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని ఉప్పల్ ప్రాజెక్ట్ అధికారి రమాదేవి కోరారు. ఈ మేరకు ఉప్పల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు ఎలా వేయాలి అనే అంశంపై మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఓటు లేని విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఓటు వేయించే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్వే అధికారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆచారాలు, ధర్మాలను పాటించాలి

– చిన్న జీయర్ స్వామి



బోడుప్పల్: ఆలయాలు ప్రశాంత నిలయాలుగా మారాలని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం సప్తాహ్నిక పంచ కుండాత్మక పుష్కర బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి సన్మార్గంలో నడవాలని, మంచి, చెడులను తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. ఆచారాలు, ధర్మాలను పాటించాలని భక్తులకు సూచించారు. ఈసందర్భంగా భక్తులు పలు సందేహాలను అడగ్గా వాటిని ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో హంపి పీఠాధిపతులు విద్యారణ్య భారతి, ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల సద్గుణాచార్యులు, అంజి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీవాసుల భూవివాదాన్ని పరిష్కరించాలి



అల్వాల్: ఎన్నో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీవాసుల భూవివాదాన్ని వెంటనే పరిష్కరించాలని అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీవాసులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీవాసులు తమ ఆందోళన వ్యక్తం చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. 1989లో రూపొందించిన లేఅవుట్‌లో ఇక్కడి సర్వే నంబర్–386లో ప్లాట్లను కొనుగోలు చేశామని, కొన్ని కారణాల వల్ల తాము ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయం పాలకులతో పాటు ప్రభుత్వ యంత్రాంగానికి తెలుసన్నారు. ఇప్పటికే కాలనీలో 120కి పైగా ఇళ్లు ఉన్నాయని, మిగతా ప్లాట్లు స్టేటస్ కో ఉన్న కారణంగా ఖాళీగా ఉన్నాయన్నారు. తాము అసలైన యాజమాన్యదారుగా దస్తావేజులు కలిగి ఉన్నామని, ఇందులో దాదాపు 75 ఏళ్లకు పైబడిన వారు ఉండగా కొంతమంది చనిపోవడం జరిగిందన్నారు. ఇక మిగిలిన వారంతా అనేక సంవత్సరాలుగా పాలకులు, అధికారులు, కోర్టు చుట్టూ న్యాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో రెండు రోజులుగా స్థానికంగా నివసించే కొందరు సదరు ప్లాట్లు తమవిగా పేర్కొంటూ వ్యవసాయ భూమిగా పేర్కొంటూ బలవంతంగా సరిహద్దుల్లో ఫెన్సింగ్ వేస్తున్నారంటూ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా తమ ప్లాట్ల వద్ద కొంతమందిని మోహరించి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అధికారులకు సమాచారం అందజేసినా ఫలితం లేదన్నారు. 1989లో రిజిస్టర్ అయిన ఇళ్లు కూడా ఉన్న స్థలానికి నేడు పాస్‌బుక్‌లు సృష్టించిన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్లాట్ల వద్ద బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం పేషీలో అర్జీ పెట్టుకున్నామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని గ్రీన్‌ఫీల్డ్స్‌వాసులు వెల్లడించారు.

ఆహా.. అనిపించిన ఫుడ్ ఫెస్టివల్



రామంతాపూర్: వెంకటరెడ్డినగర్‌లోని విజ్ఞాన జ్యోతి గ్రామర్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు వివిధ రకాల వంటకాలను స్టాళ్లలో ప్రదర్శించి ఆహా అనిపించారు. ప్రదర్శనలో వివిధ రకాల ఫ్రూట్స్ సలాడ్స్, పళ్ల రసాలు, స్వీట్లు, టిఫిన్స్, మురుకులు, ఐస్‌క్రీమ్స్, పానీపూరి, బట్టర్ మిల్క్ వంటి అనేక వంటలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ వేములకొండ సోమశేఖర్ మాట్లాడుతూ ఆహార పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఫుడ్ ఫెస్టివల్స్ దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేణుకా రామ్, నర్సయ్య, సూరం రాంరెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనులకు తోడ్పాటు అందిస్తా



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చర్లపల్లి కుమ్మరి సంఘం ప్రతినిధులు



గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: శాలివాహనులు(కుమ్మరుల) సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు తోడ్పాటు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. తమ సమస్యలపై చర్లపల్లి డివిజన్ కుమ్మరి సంఘం ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో కుమ్మరులు కులవృత్తిని కొనసాగించుకునేందుకు వీలుగా కేటాయించిన స్థలంలో అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసేందుకు సహకారం అందజేయాలన్నారు. అధునాతన పరిజ్ఞానం కలిగిన యంత్రాలతో ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థికంగా స్థిరపడతామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై సంబంధిత వ్యక్తులను కలిసి కావాల్సిన సాయం అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, బొడిగె రాజు, నేమూరి మహేష్‌గౌడ్, కుమ్మరి సంఘం ప్రతినిధులు బాలరాజు, రవి, సురేష్, రాము, రాజు, కిషోర్, భరత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీఎస్ఐఐసీ మేడ్చల్ జోనల్ ఇన్‌చార్జిని కలిసి తమ ప్రతిపాదనలను వివరించి సహకారం అందజేయాలని వినతిపత్రం అందజేశారు.

చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగిస్తాం

ఉప్పల్: అసెంబ్లీ సమావేశాల్లో ఉప్పల్ సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రస్తావించిన మేరకు అధికారులు రంగంలోకి దిగారు. ప్రధానంగా చెరువుల్లో పెరిగిన గుర్రపు డెక్కను తొలిగించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ హైకోర్టు కాలనీ వైపు ఉన్న హెచ్ఎంటీ చెరువులో తొలగిస్తున్న గుర్రపు డెక్క పనులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నిచెరువులను సుందరంగా ముస్తాబు చేస్తామన్నారు.

ముగిసిన క్రీడా ఉత్సవ్ స్పోర్ట్స్ మీట్



విద్యార్థులకు ట్రోఫీలను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: శ్రీచైతన్య ఎడ్యుకేషన్ సొసైటీ విజ్ఞాన భారతి హైస్కూల్‌లో రెండు రోజులుగా జరిగిన క్రీడా ఉత్సవ్ స్పోర్ట్స్ మీట్ శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ క్రీడాలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ఓయూ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి, అడిషనల్ డీఎస్పీ ముత్యరెడ్డి, పాఠశాల చైర్మన్ పి.బుచ్చిరెడ్డి, సాయిరాంరెడ్డి, మానసరెడ్డి, స్వప్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ సీతారామాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సీతారామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను జీహెచ్ఎంసీ స్వచ్ఛ్ సేవకులకు అందజేయాలి



షాపు యాజమానులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

ఉప్పల్: ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను ఉప్పల్ సర్కిల్ పరిధిలో స్థానికులంతా జీహెచ్ఎంసీ ఆటో వారికి అందజేయాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో శానిటరీ జవాన్లు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త తొలగించడానికి ప్రతి గడపను ఆటో వారు టచ్ చేయాల్సిందే అన్నారు. స్వచ్ఛ్ సేవకులు ప్రతి షాప్‌నకు వెళ్లాల్సిందే అన్నారు. అందుకు అవసరమైతే అధికారులు కాలనీల్లో అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. వీధుల్లో చెత్త వేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ ఆంజనేయులు, డీఈ చందన, శానిటరీ సూపర్‌వైజర్లు రాజేశ్వర్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోండి

కుషాయిగూడ: నేటి పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు కలిగిన తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

చర్లపల్లి డివిజన్ పరిధిలో..

శివమందిర్ పాఠశాల చక్రిపురం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం, కృష్ణారెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రం, ఎంఆర్ఆర్ హైస్కూల్, గోపి మెమోరియల్ స్కూల్, సాయిసింధు స్కూల్, నలంద పాఠశాల, విద్యానికేతన్ స్కూల్, టీచర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, కుషాయిగూడ వార్డు కార్యాలయం, ప్రగతి ఉన్నత పాఠశాల, బీజేఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, కుషాయిగూడ బస్టాప్‌ల వద్ద పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్ పథకం చారిత్రాత్మకం



ఉచిత విద్యుత్ పథకం అమలుపై అవగాహన కల్పిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉచిత విద్యుత్ పథకం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో, బస్తీల్లో పర్యటించి ఉచిత విద్యుత్ పథకంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైనవారు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, నల్ల ప్రభాకర్‌రెడ్డి, మంచాల రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం



అల్వాల్: మనోహర్ ట్రస్ట్, అమెజాన్ సంయుక్త ఆధ్వర్యంలో అల్వాల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన నాలుగు టాయిలెట్స్‌ను శనివారం ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ అనంత్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ట్రస్ట్ చైర్మన్ అనంత్, రఘు, తేజ, శ్రీకాంత్, హర్ష, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వీరస్వామి

కుషాయిగూడ: ఇద్దరు పాత దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. అందుకు సంబంధించిన వివరాలను శనివారం కుషాయిగూడ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వీరస్వామి వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన దార్ల నేహమయ్య అలియాస్ మేహమయ్య అలియాస్ బ్రూస్‌లీ(27) పాత నేరస్తుడు. ఇతడిపై ఇప్పటికే సికింద్రాబాద్, గుంతకల్, విజయవాడ, అనంతపురం, కర్ణాటకలో 34 దొంగతనం కేసులు ఉన్నాయి. ఏడాది క్రితం మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో జైలుకు వెళ్లి గతనెల 5న చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యాడు. మరో నిందితుడు విశాఖపట్టణం, ఎదురవానిపాలెంకు చెందిన కన్మెట్ల పాండురంగారావు(39) ప్రస్తుతం కాప్రాలోని బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్‌లో మార్కెటింగ్ చేసుకుంటూ కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. చీటింగ్ కేసులో జైలు శిక్ష అనుభవించి ఏడాది క్రితం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవించే సమయంలో ఇద్దరికి ఏర్పడ్డ పరిచయం కాస్తా స్నేహంగా మారింది. నేహమయ్య దొంగిలించిన సొత్తును పాండురంగారావు మార్కెట్‌లో విక్రయించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఇటీవలే జైలు నుంచి విడుదలైన నేహమయ్య, పాండురంగారావు కలిసి దొంగతనాలు మొదలుపెట్టారు. గత నెల 27న కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్త్ కమలానగర్‌లోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. భవానీనగర్‌లో మరో నాలుగిళ్లలో చోరీకి విఫలయత్నం చేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. పాండురంగారావు నుంచి రూ.10.71 లక్షలతో పాటు 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. 24 గంటల్లో దొంగతనం కేసును ఛేదించిన కుషాయిగూడ క్రైం మల్కాజిగిరి సీసీఎస్ పోలీసులను సీపీ అభినందించారు.

ఆస్పత్రిలో మెరుగైన సేవలందిస్తాం: ఎమ్మెల్యే



మల్కాజిగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మెరుగైన సేవలందిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆస్పత్రి ఆవరణంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న సమస్యలను ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చే నిధులు ఉపయోగించుకొని రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా ఆరోగ్య, వైద్యాధికారి డాక్టర్ రఘునాథస్వామికి సూచించారు. మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి మంచి గుర్తింపు రావాలంటే అధికారులు, సిబ్బంది పనితీరు బాగుండాలని, పలు ఫిర్యాదులు వస్తున్నందున వాటిని సరిదిద్దుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ కోట్యా నాయక్, సర్కిల్ డీసీ జి.రాజు, ఆర్ఎంవో డాక్టర్ సంగీత్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలి



వేడుకల్లో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, విద్యార్థులు

బోడుప్పల్: ఆధునిక టెక్నాలజీతో పాటు కొత్త ఆలోచనలతో విద్యార్థులు ముందుకు నడవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన లోటస్ ల్యాప్ స్కూల్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రాజెక్ట్, నృత్య రూపంలో, మైండ్ రూపంలో ప్రదర్శించారన్నారు. అలాగే ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వాటి ఉపయోగాలు, గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, పర్యావరణం వల్ల కలిగే నష్టాలు ప్రాజెక్ట్ రూపంలో తయారు చేశారని విద్యార్థులు వివరించారన్నారు. మైక్రో స్కోపులు వాటి ఉపయోగాలు, యాసిడ్ వర్షాలు ఈ మధ్య ఎలా కురుస్తున్నాయి నమూనాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థి మణివర్ధన్



విద్యార్థిని అభినందిస్తున్న రాంచంద్రారెడ్డి

బోడుప్పల్: ఇందిరానగర్ కాలనీలోని న్యూటన్ గ్రామర్ స్కూల్ 8వ తరగతి విద్యార్థి మణివర్ధన్ జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.రాంచంద్రారెడ్డి తెలిపారు. బోడుప్పల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన మణివర్ధన్‌ను జాతీయ స్థాయిలో ముందుకెళ్లడానికి రూ.10 వేలు ప్రోత్సాహకం అందజేసినట్లు వెల్లడించారు. 2వ తరగతి చదువుతున్న బాలాజీ జిల్లాస్థాయి అబాకస్ లెవెల్–1 పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. వీరిద్దరినీ వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సత్కరించి ట్రోఫీలను అందజేశారు. 2023–24 విద్యా సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులు జితేందర్‌రెడ్డి, నాగలక్ష్మి సన్మానించారు. ఈ సందర్భంగా రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, ఇన్‌చార్జులు మిస్బరాణి, ఎంఎ లూసి పాల్గొన్నారు.

ఆక్రమణలపై కొరడా

సాక్షి ఎఫెక్ట్..



సైనిక్‌పురిలో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

కాప్రా: ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై కాప్రా సర్కిల్ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ముకుంద్‌రెడ్డి ఆదేశాలతో కాప్రా సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ గిరిరాజ్ ఆధ్వర్యంలో శనివారం రంగంలోకి దిగిన సర్కిల్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. కాప్రా సర్కిల్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై శుక్రవారం అధికారులూ.. కిమ్మనరేం..? శీర్షికన ప్రచురించింది. సాక్షి కథనానికి స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. సైనిక్‌పురి చౌరస్తాలో పలు ఆక్రమణలు తొలగించారు. కాప్రా సర్కిల్ పరిధిలో చాలాచోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, దశలవారీగా తొలగింపు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాప్రా సర్కిల్ అధికారులు చేపట్టిన చర్యలతో సర్కిల్‌లోని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చర్లపల్లి జైల్‌లో జైల్ అదాలత్

కుషాయిగూడ: ఖైదీలకు న్యాయ సాయం కోసం చర్లపల్లి జైల్‌లో శనివారం జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి కోర్టు ఫస్ట్ ఏఎంఎం మేజిస్ట్రేట్ వి.అరుణ్‌తేజ 15 మందికి సంబంధించి 21 కేసులకు పరిష్కారం చూపినట్లు జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్‌రాయ్ తెలిపారు. న్యాయ సాయం కావాల్సిన ఖైదీలకు జైల్ అదాలత్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జైల్ ఉప పర్యవేక్షణాధికారులు కృష్ణమూర్తి, శశికాంత్, కాళిదాసుతో పాటు రామకృష్ణ, చంద్రశేఖర్, సురేష్, సామాంత్, నెహ్రూ, రాములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయిబాబా దేవాలయం వార్షికోత్సవం



అల్వాల్: అల్వాల్ జొన్నబండ బృందావన కాలనీలోని శ్రీసాయిబాబా దేవాలయం 16వ వార్షికోత్సవ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మాచినేని జోగిరాజు, చిలక విశ్వనాథం, బాలరాజు, వంశీ, భబిత, భిక్షపతి, శ్రీనివాస్, రాజిరెడ్డి, ప్రధాన అర్చకులు రాఘవశర్మ పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నెలనెలా కళారాధన, సంగీత నృత్య కార్యక్రమాలు రమణి సిద్ది ఆధ్వర్యంలో జరిగాయి. త్యాగరాజ గానసభ సంగీత కళాశాల ప్రిన్సిపల్ సంయుక్త చివలూరి శిష్యం బృందం విజయ లక్ష్మీ, ఉదయరాణి, నిర్మల, రాజేంద్ర ప్రసాద్, భార్గవి, శ్రీనివాస, నారాయణరాజు తదితరులు ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. శ్రీదేవి రాంకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవల్లిశర్మ ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను అభినందించారు.

విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి



రామంతాపూర్: పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన వైష్ణవి ఒలింపియాడ్ స్కూల్ 12వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా శిక్షణ ఇవ్వాలని మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని వారు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మహ్మద్ కబీర్ సోహెల్, సుభీర్‌ఖాన్, డాక్టర్ రామ్ చరణ్‌రెడ్డి, మహ్మద్ రఫీక్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టులు తమవంతు పాత్ర పోషించాలని అల్వాల్ ప్రెస్ క్లబ్, ప్రింట్ మీడియా నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. శనివారం అల్వాల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ ఆర్.మధుసూదన్‌రెడ్డి, గౌరవ సలహాదారుడిగా సీనియర్ జర్నలిస్ట్ ఆస శ్రీరాములు, నూతన అధ్యక్షుడిగా మక్తాల రాములుగౌడ్, ఉపాధ్యక్షులుగా వర్మరాజు, ఎం.నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పల్లె మల్లేష్, సంయుక్త కార్యదర్శిగా కరణం శివకుమార్, కోశాధికారిగా బచ్చు చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఎం.ఉపేందర్, ఎం.దీపక్, నర్సింహలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.